# ఈ తరం ప్రేమకథ

రచన :
శ్రీ ఎమ్. అయోధ్యా రెడ్డి.

(గత సంచిక తరువాయి)

రాధ మౌనంగా తమ్ముని వదనంలోకి పరిశీలనగా చూస్తూ వుండిపోయింది.

"సరేగాని అక్కా! మేము తిరిగివచ్చేప్పుడు అమ్మ నిన్ను తోటకు రమ్మంది. వస్తావా? లేక బావ నడగ నుంటావా?" అప్పుడే గుర్తుకు వచ్చినట్టుగా రాధ వైపు చూస్తూ అడిగాడు రవి.

"బావ నడగాల్సిన పనిలేదు: నేను రాదల్చుకోలేదు" నిర్మోహమాటంగా అంది రాధ:

"అదేం! ఎందుకు రావక్కా?"

"వచ్చి ఏం చెయ్యాలి?"

"బాగుంది అందరూ ఏం చేస్తారు?"

"ఏమో నేను రాను అంతే!"

రవి ఆశ్చర్యంగా చూశాడు రాధవైపు "అంత ఖచ్చితంగా మాట్లాడతావేం? అక్కడ నీకోసం అమ్మ... పెద్దమ్మ...! బాబాయ్‌గారూ...!!"

"వారికి ఉత్తరం రాస్తాను"

"అయితే నువ్వుమాత్రం రావన్నమాట"

"రాను"

"ఎప్పటికీ రావా?" చిలిపిగా నవ్వుతూ అడిగాడు రవి.

"వస్తాను"

"మరెప్పుడూ?"

"నువ్వు పెళ్ళి చేసుకున్నతర్వాత"

"ఓహ్! అదా నీ కోపానికి కారణం అక్కయ్యా!" నవ్వాడు రవి.

"ఏం ఇప్పటికైనా చేసుకోవుట్రా పెళ్ళి? నేను రాకపోయినా పరవాలేదన్నమాట" సూటిగా వచ్చాయి రాధ మాటలు.

రవి వదనం కళాహీనమైంది. ఆవేదనగా అన్నాడు "ఎంత మాటన్నా వక్కా! నేనంత దుర్మార్గున్నను కున్నావా? అమ్మకాదు, నిన్ను పదిరోజులపాటు చూడకపోతే నేనేం వుండలేను. అసలు నాకు పొలం పనులు లేకపోతే నువ్వు వద్దన్నా ఇక్కడే వుండేవాడిని. కాని మీరంతా నన్ను పెళ్ళి చేసుకో మని అదే పనిగా ఎందుకు బలవంతం చేస్తున్నారో అర్థంకావడం లేదు"

రాధ హృదయం కరిగిపోయింది. తమ్ముని మనసు నొప్పించినందుకు అమితంగా నొచ్చుకుంది. దగ్గరగా వెళ్ళి తల మృదువుగా నిమురుతూ ఆర్ద్రంగా అంది "చూడు రవీ! నీకేం లోటుందని పెళ్ళి చేసుకో నంటావు చెప్పు? నీతోటి స్నేహితులు, చివరకు రాజు కూడా వివాహం చేసుకుంటున్నాడు చూడు. నువ్వు పెళ్ళి కొడుకువైతే చూడాలని నేనెంత ఆరాట పడ్తున్నానో తెలుసా? పోనీ నీ మనసులో ఎవరైనా వుంటె నాతో చెప్పరా రవీ!"

"అబ్బె! అలాంటి దేమీలేదులే అక్కయ్యా!"

"మరెందుకురా పంతం?"

"ఏమిటో అక్కయ్యా! పెళ్ళి పెళ్ళని మీరందరూ ఎందుకంత ఫోర్స్ చేస్తారో నాకర్థం కాదు. నాకు అదంటె ఒకవిధమైన జంకు. జీవితానికి స్వేచ్ఛ లేకుండా పోతుందేమో అన్పిస్తుంది. నాది అసలే విచిత్ర మనస్తత్వం, పైగా సున్నితమైందికూడా. ఎవరో ఇదివరకు పరిచయంలేని నూతన స్త్రీని జీవిత భాగ స్వామిగా స్వీకరించటం, ఆమె ఆశయాలేమిటో, స్వభావ మేమిటో తెలియని పరిస్థితిలో తాళిగట్టి అటు ఆవిడ మనస్సులో, ఇటు మన హృదయంలో సంఘర్షణ పెంచుకోవడ మెందుకు చెప్పు?"

"లోకంలో అందరూ ఇలాగే వున్నారంటావురా రవీ!"

"లోకం సంగతి నాకు తెలియదక్కా! నా అనుమానం వివరించానంతే!"

"అయితే! ఈ అర్థంలేని జంకుతో జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోతావన్నమాట. అంత గొప్ప రచయితవు ఇంత పిరికివాడవెలా అయ్యావురా"

మీ...
కుటుంబానికి కావలసినవాటిని ఎన్నుకోండి!!
- టెక్స్ టామ్ -
* బనియన్లు. * డ్రాయర్లు.
* చెడ్డీలు. * కట్ బాడీలు.
తయారీంచువారు :—
టామ్‌టెక్స్ నిట్టర్స్, తిరుపూరు-638602
TEX TOM
Trade Mark
BANIANS

మందహాసం చేశాడు రవి "రచయిత మానవాతీతుడు కాలేదక్కా! అయినా నీకా సంశయం అక్కర్లేదు, నేను బ్రహ్మచారిగా వుండిపోను. నామనసుకు దగ్గరగా వచ్చిన అమ్మాయిని తప్పకుండా పెళ్ళాడతాను"

"సరే! అలాగే కానివ్వు. అని రాజు పెళ్ళితో బాటే నీదికూడా అవుతే బాగుంటుంది. త్వరగా నీ మనసుకు నచ్చిన అమ్మాయిని ఎన్నుకో ఏం?" రాధ తమ్ముని చేయి మృదువుగా నొక్కి వెళ్ళిపోయింది.

* * *

మరునాడు ఉదయం పదిన్నరైంది.

నున్నగా దువ్వుకున్న క్రాపింగుతో, కళ్ళకు నల్లని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని, బ్లూకలర్ సూటు ధరించిన రవి సత్తెమ్మా నరసింహారావు స్మారక కళాశాల ముందు గేటు దగ్గర హుందాగా నిలబడియున్నాడు.

రకరకాల వేషాల్లోవున్న చాలామంది అమ్మాయిలు, అబ్బాయిలు, గేట్లోంచి లోపలకు వెళుతున్నారు. కొందరు బయటకు వచ్చేవాళ్ళు వస్తున్నారు కబుర్లు చెప్పుకుంటూ.

రవి బయటకు వచ్చే అమ్మాయిల వంక పరిశీలనగా చూస్తున్నాడు. వాణి ఇంకా బయటకు రాలేదు. నిలబడి, నిలబడి విసుగేసిందతనికి. చేయెత్తి టైము చూశాడు. పదకొండుకు ఐదు నిమిషాలు తక్కువుంది టైము.

రవి మరోమారు గేట్లోంచి లోపలకు చూశాడు. వాణి ఎడంచేతిలో పుస్తకాలతో మెట్లు దిగి బయటకు వస్తోంది.

వాణి గేటుదాక వచ్చి రావటంతోనే అక్కడే నిలబడియున్న రవిని చూసింది. ఆమె ముఖం విప్పారింది.

"అప్పుడే వచ్చేశారా?" అంది సంతోషంగా.

"అవును పదండి" అన్నాడు రవి కంఠంలో ఏ భావాన్నీ వ్యక్తీకరించకుండా.

ఇరువురూ పేవ్‌మెంట్ మీద నడక సాగించారు. రవి మౌనంగా అడుగువేస్తూ వాణి వైపు పరిశీలనగా చూశాడు. ఉత్సాహంగా నడుస్తోందామె. లేత పసుపు రంగు చీర, అదే రంగు జాకెట్టు, వదులుగా అల్లుకొని వదిలేసిన పొడుగాటి జడ తలలో సువాసనల్ని వెద జల్లుతున్న తెల్లని మల్లెలు.

రవి మనసు పరవశంతో తేలిపోయింది. 'వాణి అందమైనది...చాలా అందమైనది' అనుకున్నాడు లోలోపల.

అలా ఆమె ప్రక్కగా నడుస్తుంటె చెప్పలేనంత హాయిగా వుంది రవికి. అలా తామిద్దరు పక్కపక్కగా నడుస్తూ చుట్టూ చాలామందిని ఆకర్షిస్తున్న విషయం ఇరువురిలో ఎవ్వరూ గమనించటం లేదు.

"ఇలా ఎక్కడిదాకా" అకస్మాత్తుగా ప్రశ్నించాడు రవి.

"అదిగో! దిల్ షాద్ టాకీస్ వచ్చేసింది. అందులో కూర్చుందాం" రోడ్ క్రాస్ చేస్తూ అంది వాణి. ఆమెను అనుసరించాడు రవి.

ట్రాఫిక్ చాలా జోరుగా వుంది. అడుగుముందుకేయడానికి సందివ్వకుండా వాహనాలు ఒకదాని వెనక మరోటి అటూ, ఇటూ పరిగెడుతున్నాయ్.

వాణి రెండడుగులు ముందు కెళ్ళింది. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించుకొని మరో రెండడుగులు వేసింది. వెనకనుంచి వస్తున్న టాక్సీని చూడలేదు. టాక్సీ డ్రైవరు సడెన్ బ్రేక్ వేశాడు. అయినా లాభం లేకపోయింది.

రవి చటుక్కున వాణి చెయి పట్టుకొని వెనక్కి లాగాడు. వాణి తూలి పడబోయింది. రవి ఆమె భుజం పట్టుకొని ఆపాడు. టాక్సీ ముందుకు వెళ్ళిపోయింది.

"మై గాడ్!" అంది వాణి వేగంగా కొట్టుకుంటున్న గుండెలమీద చెయి వేసి అదిమిపడుతూ.

"రోడ్డు క్రాస్ చేసేప్పుడైనా జాగ్రత్తగా నడవకపోతె ఎలా వాణీ!" రోడ్ దాటాక వాణి భుజం విడిచిపెడుతూ అన్నాడు రవి.

"థాంక్స్" అంది వాణి సిగ్గుపడుతూ.

రవి మందహాసం చేశాడు. ఇరువురు థియేటర్ ఆవరణలో ప్రవేశించారు. రవి వెళ్ళి టికెట్లు తెచ్చాడు. వెళ్ళి బాక్స్‌లో కూర్చున్నారు ఓ మూలగా.

పిక్చర్ అప్పటికే బిగిన్ అయింది. హాలంతా నిశ్శబ్దంగా వుంది. "హిందీ పిక్చరులా వుందే! పేరేమిటి?" కూర్చున్నాక అడిగాడు రవి.

"ఏమో! నాకూ తెలియదండీ!!" అంది మెల్లగా వాణి. ఆమె గొంతు తడబడింది. కంఠంలో ఇందాకటి భయ మింకాపోలేదు.

"మీ కింకా భయం తగ్గనట్లుందే!" నవ్వాడు రవి. వాణి జవాబు చెప్పలేదు. సిగ్గుతో ముడుచుకు పోవటం ఆ మసక చీకట్లో గమనించాడు రవి.

"నిత్యం సిటిలో వుండే మీరే అంత అజాగ్రత్తగా రోడ్డు దాటితే ఇక మాలాంటి పల్లెటూరివాళ్ళు, పట్నం వస్తె కాలో, చెయ్యో విరగొట్టుకోవల్సిందే ఏమంటారు?" మృదువుగా నవ్వుతూ అన్నాడు రవి.

వాణి కొద్ది సేపు మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా చిన్నగొంతుతో అంది "నేనెప్పుడూ అంత అజాగ్రత్తగా రోడ్డు క్రాస్ చెయ్యనండి. ఏమిటో ఈ రోజు ఇలా అయింది"

రవికి కొద్దిగా ఆశ్చర్యమేసింది. ఈ అమ్మాయిలో వుండె నిన్నటి చిలిపితనం, చొరవా ఏమైపోయాయా అని?

మార్నింగ్ షో, అందుకుతోడు పాత సినిమా కావటంవల్ల బాక్స్‌లో ఓ, పది మంది తప్పితే అట్టే లేదు. వీరు మాట్లాడే మాటలు ఎవ్వరికీ డిస్టర్బ్ కల్గించడంలేదు.

"మీరు నాతో మాట్లాడా లనుకున్న దేమిటో చెప్పండి" అసలు విషయం ప్రస్తావనకు తెచ్చాడు రవి.

వాణి హృదయం వేగంగా స్పందించింది. 'ఏం మాట్లాడాలి? మనసులో ఎన్నో అనుభూతులు! గుండెలో ఎదో సంచలనం! అంతరంగంలో అవాజ్యమైన ఉద్వేగపు వొరవడి!! ఇంకా ఏమిటో, ఏదో అయిపోయింది తను. తొందరపడి ఏదో వెర్రి ఆరాటంతో అతన్ని రమ్మని రాసింది గాని, ఇప్పుడు అసలు విషయం చెప్పగలదా? అసలు పెదవులు విడివడందే ఏం చెబుతుంది? ఎలా చెపుతుంది?"

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

ఉలిక్కి పడింది వాణి "ఏం లేదు..."

"ఏదో మాట్లాడా లన్నారు!"

"ఏం మాట్లాడాలి?"

"బాగుంది" నవ్వాడు రవి "ఏదో ముఖ్యమైన సంగతి చెబుతానన్నారు. అందుకేగా మన మిక్కడకు వచ్చింది!"

వాణి మళ్ళీ మూగగా వుండిపోయింది. అతనితో ఎన్నో చెప్పాలనుకుంది. తీరా రవి కన్పించగానే అన్నీ మరిచిపోయినట్లుగా, గొంతు స్తంభించిపోయి, ఏమిటోలా అయింది పరిస్థితి. 'తన చిలిపితనమంతా ఏమైపోయిందో!' అనుకొంది.




"మీ అక్కయ్య సరోజను గురించి అడుగుదా మనుకున్నారా! నిన్న నేను చెప్పకుండా వెళ్ళాను కదూ! అయితే వినండి. మీ అక్కయ్య మా రాజుకు తగిన భార్య వాణీ! మావాడికి కూడా బాగా నచ్చిందామె. వారిద్దరి వివాహం తప్పకుండా జరుగుతుంది. మీ రీమాటే అడగటాని కిక్కడకు వచ్చినట్లయితే పదండి ఇక పోదాం!"

వాణి ఉలిక్కిపడి తలెత్తింది "కాని... కాని, నేనా విషయం గురించి మిమ్మల్ని రమ్మనలేదు—అది..." ఆమె పెదవులు కంపించాయి, మాట పూర్తి చేయలేక పోయింది.

రవి మృదువుగా మందహాసం చేసి అన్నాడు "మరి యెందుకూ?" వాణి తలెత్తి ఏదో చెప్పబోయింది. రవి కళ్ళు ఎందుకో చిలిపిగా నవ్వుతున్నాయ్. చటుక్కున చూపులు దించుకుందామె.

రవి కొంచెం గంభీరంగా మారిపోతూ అన్నాడు "చూడు వాణీ! నువ్విలా వీరయ్యతో ఉత్తరం పంపడం సబబైన పని కాదు. ఈ విషయం నీకు తెలియంది కాదు. చదువుకుంటున్న యువతివి కాబట్టి పోషల్‌గా వుండటం ఇక్కడి నాగరికత వొప్పుకుంటాను. ఇలా పరాయి యువకునితో థియేటర్‌కు వచ్చావు. ఎవరైనా పరిచయస్థులకు కన్పిస్తే ఎలా వుంటుందో ఆలోచించు!" రవి కొద్దిగా ఆగిపోయి తల తిప్పి వాణివైపు చూశాడు.

తల వంచుకు కూర్చునివుంది వాణి. పైట బుజాల చుట్టూ కప్పుకొని అలా ముగ్ధగా అమాయకంగా కూచున్న ఆ అమ్మాయివైపు చాలా రవి చూశాడు కొన్ని క్షణాలు.

రవి చొరవగా వాణి చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి వదిలాడు,

విద్యుత్ ప్రవహించినట్లయింది వాణికి, ఇందాక రోడ్డుమీద అతని చేయి తన భుజాన్ని నొక్కి పట్టుకున్న స్పర్శ, దాని తాలూకు అనుభూతి గుండెల్లో కదులుతూనే వుంది. ఆమె చేయి పరవశంతో వొణికింది.

"నీ అంతరంగం నాకు తెల్సులే వాణీ! పదపోదాం!! ఇంటికి వెళ్ళాక ఇంకా పూర్తిగా ఆలోచించుకో ఏం?" వాణి భుజం అనురాగంతో తట్టి సీటులోంచి లేచాడు రవి.

తానుకూడా లేచి అతన్ని అనుసరించింది వాణి.

* * *

మరుసటి దినం ఉదయాన్నే రాధా, కేశవ్‌లవద్ద శెలవు తీసికొని రాజూ, రవీ స్వగ్రామం వెళ్ళిపోయారు. (సశేషం)

---

## కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం - 1938.

విడి ప్రతి — 0-40 పైసలు

సంవత్సర చందా — రూ. 7-50.

(రెండు ప్రత్యేక సంచికలతోసహా)

నేడే చందాదారులుగా చేరండి.